

# పసిడిమనసులు - షర్మిల



## నెలనెలా పసిడిమనసులు చెప్పే మనసైన కథలు..!

# చిట్టెమ్మ – కోడికూర

ఆవాళ్ల మేం కోడిని కోసుకుంటున్నమన్నమాట. కోడికూర అందరూ వండుకుంటారు అదేం పెద్దవిషయం అంటారా!? ఎవరింట్లోనైనా వండుకోవడం వేరు మా చిట్టెమ్మగారి దివాణంలో వండడం వేరు. దివాణం అంటే ఏ రాజా వారిదో కాదు మా ఇంటికి మా పెద్దతాత పెట్టిన పేరు. ఎప్పుడూ వచ్చేపోయే వాళ్లతో సందడిగా వుండేది. చిట్టెమ్మ చేతి కాఫీ తాగడానికి చార్జీలు పెట్టుకురావచ్చనేవారు. ఎవరు వాకిట్లోకి వచ్చినా ఇంట్లో వండుకున్నవి ఏ దాపరికం లేకుండా తాత ,నాయనమ్మ పందేరాలు చేసేవారు. ఇది చూసే మా పెద్దతాతకి మండి 'దివాణం' అని సణుక్కునేవాడు.

ఇంతకీ కోడి సంగతి మర్చిపోయాను. మేము కోడిని మా ఇంట్లో వాళ్లకోసం ఏనాడు కోసేవాళ్లం కాదు. ఎవరైనా చుట్టాలు వస్తే మాత్రం మా నాయనమ్మ చేసే మర్యాదలు మర్యాదలు కాదు. గారెలు కోడికూర, బొమ్మిడాయల వేపుడు, పప్పుచారు ఒకటేంటి రకరకాలు వండేది. కోళ్లని కోళ్ల గూట్లోకి వదిలేటప్పుడే దేన్ని వండాలో రాగోలు కి చెప్పి పొద్దున్న దాన్ని మాత్రం గూట్లోనుంచి వదలొద్దని ఆర్డర్ వేసేది. గుట్టుచప్పుడు కాకుండా మిగతా వూళ్లోవాళ్ల మాదిరిగా వండుకోవాలని చిట్టెమ్మ ఆశ. అబ్బే అది ఎంత రచ్చ అవ్వాలో అంతా అయ్యేది. తెల్లారడమే కోళ్లని గూట్లోనుంచి వదిలే కోటేసు మా నాయనమ్మ ఏ కోడిని వండాలనుకుందో దానినీ వదిలేసేవాడు. దానితో ఈమె లబలబలాడేది .

"మీరు నాకెప్పుడు చెప్పారు వదలొద్దని ? రాగోలుకి చెప్పారేమో " అని కోడి వెనకాల పరిగెత్తడం మొదలెట్టేవాడు.

ఈలోగా రాగోలు ,ఇంకో ఇద్దరు కలిసి ఇంటి చుట్టూ కేకలేసుకుంటూ పరుగులు తీసేవారు. దారేపోయేవాళ్లు ఈ గోల ఏంటో అడిగి " ఓహో ఇవ్వాళ్ల చిట్టెమ్మ కోడిని కోస్తాందా"" అనుకుంటా వెళ్లేవారు.

మొత్తానికి గుట్టుగా కానిద్దామనుకున్న పని వూళ్లో సగం మందికి తెలిసేది. ఇక దాన్ని పట్టుకుని ఇంటిఎదురుగా వున్న చెరువొడ్డున కాల్చేవారు. దాని చుట్టూ కూడా జనం పోగై " ఆ నల్ల పెట్టేనా ! బాగా కొవ్వుబట్టి వుండేది ... మా బాగా వుంటందిలే కూర " అని అంటుంటే ఇక్కడ చిట్టెమ్మ పళ్లు పటపటలాడిస్తూ "హవ్వ ఇరుగూ పొరుగూ కోడిని కోసుకుని ఎన్నిసార్లు. తిన్నా సడీ సప్పుడూ వుండదు, నా కొంపలో మాత్రం వూరూ వాడా చాటింపు అవ్వాల్సిందే " అని బుగ్గలు నొక్కుకునేది.

ఇక ఇంట్లోకి తెచ్చి దాని కోసేటప్పుడు మా రాగోలు కోడి తల, కాళ్లు తను ఇంటికి పట్టికెళ్లడానికి వేరే పెట్టుకుని వాటితోపాటు నాలుగు మంచి ముక్కలు వేసుకునే వాడు. మా చిట్టెమ్మ వాటిని తీస్తావా లేదా అని పోట్లాటకి దిగేది.

" వూరుకోవమ్మా వుట్టి తల,కాళ్లు ఏం వండుకోమంటావ్? " అని ఎదురు తగాదాకి దిగేవాడు.

ఈలోగా తాత " పోన్లే తీసుకుపోనియ్యి గోల ఏంటి రోతగా " అని తిట్టడంతో ఆ అంకం సమాప్తమయ్యేది.

రాగోలు వాటిని ఇంటికి తీసి కెళ్తా "మా చిట్టెమ్మ గారింట్లో కోడి కూరొండుకుంటన్నారు ...ఇయిగో నాకూ నాలుగు ముక్కలిచ్చారం"టా వుళ్లో మిగతా వాళ్లకి కూడా చాటింపు వేసేవాడు.

" ఇవాళ్ల ఏం కూర చిట్టెమ్మా?" అని మామూలుగా రోజూ అడిగే అమ్మలక్కలు ఆ రోజు మాత్రం " చిట్టెమ్మా కోడిని కోసుకున్నారంటగా" అని అడిగితే అప్పుడు మా నాయనమ్మ చిట్టెమ్మ మొకం చూడాలి.

అట్లా మా ఇంట్లో కోడిని కోసుకునే యావత్తు వ్యవహారం వూరిజనానికి మైకులో చెప్పించినా రానంత ప్రచారం జరిగేది.

*(వచ్చేనెల మరో పసిడిమనసు కథ)*

COMMENTS